## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక — సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 72 సోమవారం జూలై 13 2026, పేజీలు - 4 వెల :2/-


# జలవనరుల నిర్వహణ పై..

# నేడు ఢిల్లీలో సదస్సు



హిందూస్థాన్ మీడియా

దేశంలో జలవనరుల సుస్థిర నిర్వహణ, కేంద్ర–రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా సోమవారం ఢిల్లీలో కీలక సదస్సు జరగనుంది. కేంద్ర జలశక్తి శాఖ పరిధిలోని జల వనరులు, నదీ అభివృద్ధి, గంగా పునరుజ్జీవన విభాగం ఆధ్వర్యంలో 'రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల జలవనరుల శాఖ అత్యున్నత కార్యదర్శుల అఖిల భారత సదస్సు'ను నిర్వహించనున్నారు. సుష్మాస్వరాజ్ భవన్‌లోని చాణక్య హాల్ ఈ సమావేశానికి వేదిక కానుంది. కేంద్ర జలశక్తిమంత్రి సి.ఆర్.పాటిల్ అధ్యక్షతన జరగనున్న ఈ సదస్సులో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులతోపాటు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. ఈ సమావేశంలో జల వనరుల సంరక్షణ, సంస్కరణలకు సంబంధించి ప్రధానంగా ఎనిమిది అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా 'ఆధునీకరణ– కమాండ్ ఏరియా అభివృద్ధి, నీటి నిర్వహణ (ఎమ్–సీఏడీడబ్ల్యూఎ)' పథకంపై సమీక్షిస్తారు. నీటి సంరక్షణలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు దేశవ్యాప్తంగా నెల రోజులపాటు చేపట్టబోయే ప్రత్యేక 'క్యాచ్ ది రెయిన్' ప్రచారంపై ముసాయిదాను ఖరారు చేస్తారు. నీటిపారుదల, వరద నిర్వహణ, బహుళ ప్రయోజన ప్రాజెక్టుల కోసం సవరించిన ముసాయిదా ప్రాజెక్ట్ మదింపు మార్గదర్శకాలు, జలాశయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆనకట్టల రూల్ కర్వ్ అమలు తీరుపైనా చర్చించనున్నారు. దీనితోపాటు జల సంస్కరణల చట్టం (ఎస్‌డబ్ల్యూఆర్ఎఫ్) అమలు, వచ్చే డిసెంబరు నాటికి దేశవ్యాప్తంగా 'సమగ్ర డ్యామ్ భద్రతా మూల్యాంకనాన్ని (సీడీఎస్ఈ)' పూర్తి చేయడంపై కార్యాచరణను రూపొందించనున్నారు. జల సంరక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచే రాష్ట్రాలకు ఇచ్చే 'మోడల్ స్టేట్ వాటర్ అవార్డుల' కోసం కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావడం పై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

**నేడు ఢిల్లీకి మంత్రి ఉత్తమ్**

సోమవారం సీఎంతో కలిసి దేవాదుల ప్రాజెక్టును పరిశీలించనున్న మంత్రి ఉత్తమ్ తర్వాత ఢిల్లీకి వెళ్లనున్నారు. సాయంత్రం 6 గంటలకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి, ఇతర అధికారులతో భేటీ కానున్నారు. ఎన్డీఎసఏ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. ఏఐబీపీ పథకం కింద దేవాదులకు ఇంకా అందాల్సిన నిధుల విడుదల, మేడిగడ్డ పునరుద్ధరణ కోసం ఎన్డీఎస్ఏ సాంకేతిక కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

# వచ్చేస్తోంది బుల్లెట్ ట్రైన్..

## హైదరాబాద్‌కు 3 కొత్త కారిడార్లు..

## తొలి సర్వీస్ ఎక్కడి నుంచి ఎక్కడికంటే



- 2027 ఆగస్టు 15 నుంచి దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్
- సూరత్–బిలిమోరా మార్గంలో మొదటి సర్వీస్ ప్రారంభం
- హైదరాబాద్ కేంద్రంగా మూడు కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లు
- ముంబై–అహ్మదాబాద్ ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తి
- తెలంగాణలో పలు రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

హిందూస్థాన్ మీడియా

భారతదేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ సేవలు 2027 ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ముంబై–అహ్మదాబాద్ హై–స్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) కారిడార్‌లో భాగంగా సూరత్–బిలిమోరా మధ్య తొలి సర్వీసును నడపనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మార్గం దేశంలోనే మొట్టమొదటి హై–స్పీడ్ రైలు మార్గంగా నిలవనుంది. 508 కిలోమీటర్ల పొడవైన ముంబై–అహ్మదాబాద్ కారిడార్‌ను దశలవారీగా ప్రారంభిస్తారు. సూరత్–బిలిమోరా సెక్షన్ ప్రారంభమైన తర్వాత, మిగిలిన మార్గాలైన వాపి–సూరత్, వాపి–అహ్మదాబాద్, అహ్మదాబాద్–థానే, చివరగా పూర్తిస్థాయిలో అహ్మదాబాద్–ముంబై మార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పనులు ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను చేరుకునేందుకు నిర్మాణం శరవేగంగా జరుగుతోందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు రెండు ఆర్థిక రాజధానుల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా, కారిడార్ వెంబడి ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు. ఈ సందర్భంగా దేశంలో హై–స్పీడ్ రైల్వే నెట్‌వర్క్‌ను విస్తరించే ప్రణాళికలను కూడా వైష్ణవ్ వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా మూడు కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. పుణె–హైదరాబాద్, హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు మార్గాలు ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు దక్షిణాది రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచుతాయి. వీటితో పాటు హైదరాబాద్–ముంబై మధ్య కూడా మరో హై–స్పీడ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ నగరానికి మూడు హై–స్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్లను కేటాయించారు. ఇవి నగరం రూపురేఖలను పూర్తిగా మారుస్తాయి" అని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈ నెట్‌వర్క్ తెలంగాణలోని అనేక జిల్లాల మీదుగా ప్రయాణిస్తూ, రాష్ట్రంలో కనెక్టివిటీని మెరుగుపరుస్తుందని తెలిపారు.

# పవన్ రెండో భుజానికి కూడా సమస్య ఉందని వైద్యులు చెప్పారు

- ముంబై ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు
- భుజానికి మూడున్నర గంటల పాటు ఆపరేషన్ జరిగిందని వెల్లడి
- పవన్‌కు మూడు వారాల పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు
- ప్రజల మధ్యలో ఉన్నప్పుడు ఒత్తిడి కారణంగానే పవన్‌కు గాయమైందని వెల్లడి

హిందూస్థాన్ మీడియా

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆదివారం ఆయన ముంబై వెళ్లి ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆరోగ్య పరిస్థితిని, వైద్యుల సూచనలను వివరించారు.

**అభిమానుల తాకిడి వల్లే సమస్య**

పవన్ కల్యాణ్ ఎప్పుడూ ప్రజల సేవలోనే ఉంటారని, వారి మధ్యకు వెళ్లినప్పుడు తనను తాను మరిచిపోతారని చంద్రబాబు అన్నారు. "పవన్ ఎక్కడికి వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం వస్తారు. ఆ సమయంలో తోపులాట, ఒత్తిడి సర్వసాధారణం. ఈ ఒత్తిడి కారణంగానే ఆయన భుజానికి సమస్య వచ్చింది. ఇది ఈరోజు వచ్చింది కాదు, చాలా కాలంగా ఈ నొప్పితో బాధపడుతున్నారు. చివరకు ఇక్కడికి వచ్చి అత్యుత్తమ వైద్యుల చేత ఆపరేషన్ చేయించుకున్నారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ ఆపరేషన్ జరిగింది" అని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం పవన్ వేగంగా కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యవంతులవుతారనే విశ్వాసం ఉందని చెప్పారు. వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్‌కు మూడు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆ తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. "పవన్ రెండో భుజానికి కూడా కొంచెం సమస్య ఉంది. దానికి ప్రస్తుతానికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచించారు. ఆరు నెలల తర్వాత పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే తదుపరి చర్యలు తీసుకుంటారు" అని చంద్రబాబు వెల్లడించారు.

**జాతీయ అంశాల పై స్పందన**

ఈ సందర్భంగా చంద్రబాబు పలు జాతీయ అంశాలపై కూడా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "ప్రధాని మోదీ వల్ల ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవం పెరిగింది. ఆయన కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే శక్తివంతమైన నాయకుడు. నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే, భారతదేశం మాత్రం స్థిరంగా అధిక వృద్ధి రేటును సాధిస్తోంది. దీనికి కారణం మోదీ నాయకత్వమే. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం వల్లే ఇది సాధ్యమవుతోంది. ఆయన నాయకత్వంలో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనే పూర్తి విశ్వాసం నాకుంది" అని చంద్రబాబు అన్నారు. వియత్నాం పడవ ప్రమాదంపై మాట్లాడుతూ.. అది చాలా దురదృష్టకరమైన సంఘటన అని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. మృతదేహాలను వెనక్కి తీసుకువస్తున్నామని, అక్కడున్న వారిని సురక్షితంగా వెనక్కి పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇక ఉత్తరప్రదేశ్ లో అయోధ్య ఘటనపై మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విచారణ జరుగుతున్నందున కొంత సమయం వేచి చూడాలన్నారు. పశ్చిమ బెంగాల్‌లో యూసీసీ కమిటీ ఏర్పాటును స్వాగతిస్తూ.. ఒకప్పుడు 'బెంగాల్ ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది' అనే వారని, మధ్యలో ఆగిపోయిన



ఆలోచన ఇప్పుడు మళ్లీ మొదలైందని, బెంగాల్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి అడిగిన ప్రశ్నకు, నాయకుల పనితీరును బట్టే ప్రజలు అంచనా వేస్తారని, సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా ఉన్నప్పుడే నాయకులకు విశ్వసనీయత లభిస్తుందని చంద్రబాబు పరోక్షంగా చురకలు అంటించారు. అనంతరం, పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వైద్యుల నివేదికను చంద్రబాబు మీడియాకు అందించారు.

## బాల వికాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





చిన్నకోదూరు, హిందుస్థాన్ మీడియా:
చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, సిద్దిపేట రిషిన్ ఇండో అమెరికన్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి రఘురామకృష్ణ మాట్లాడుతూ, వైద్య సేవలు అందుబాటులో లేని గ్రామీణ ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి కారణంగా కాళ్ల నొప్పులు, ఆర్థోపెడిక్ సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు రేణుక, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లం చంద్రం, శంకర్, జీపీఓ ఆనంద్, ఆశా వర్కర్ లక్ష్మి, బాల వికాస్ కోఆర్డినేటర్లు సుజాత, లక్ష్మి, సరిత, శ్రీలతతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా కదలిరావాలి

**–'సే నో టు డ్రగ్స్' 2కే ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ**



హనుమకొండ, హిందుస్థాన్ మీడియా:
మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని ఆమె అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించనున్న 'సే నో టు డ్రగ్స్' 2కే అవగాహన ర్యాలీ పోస్టర్‌ను ఆదివారం మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం యువత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రభుత్వం, మీడియా, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. సామాజిక బాధ్యతతో టీఎస్‌జేయూ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ ర్యాలీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షుడు నారగొని పురుషోత్తం మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలపై నిరంతర అవగాహన ద్వారానే యువతను రక్షించగలమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు జర్నలిస్టులు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జిల్లా కోశాధికారి సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ, జూలై 23న నిర్వహించే 2కే ర్యాలీలో విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర, జిల్లా నాయకులు వేణు, నగేష్ గౌడ్, నరేష్ గౌడ్, వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు ఈద శ్రీనాథ్, నాగపురి అవినాష్, కౌడగాని మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రంకు ఘన సన్మానం

**–రామునిపట్ల బోనాల జాతరకు ఆహ్వానం**



చిన్నకోదూరు, హిందుస్థాన్ మీడియా:
ఇటీవల సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దరిపల్లి చంద్రంను చిన్నకోదూరు మండలం రామునిపట్ల గ్రామ శాలివాహన సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతర మహోత్సవానికి దరిపల్లి చంద్రంను సంఘ సభ్యులు అధికారికంగా ఆహ్వానించారు. సన్మాన కార్యక్రమంలో దరిపల్లి చంద్రం మాట్లాడుతూ, శాలివాహన సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో, సంఘంలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తమపై చూపిన ఆదరణకు సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం అధ్యక్షుడు జి. తిరుపతి, ఉపాధ్యక్షుడు వరుకోలు భూపతి, కోశాధికారి ప్రదీప్, సభ్యులు తిరుపతి, పరశురాములు, శ్రీధర్, కుంటయ్య, శ్రీనివాస్‌తో పాటు సంఘ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తులసి రాం లో ఉచిత వైద్య శిబిరం!

**–12 నుంచి జూలై 19 వరకు ఉచిత వైద్య సేవలు**

చేర్యాల (హిందూస్థాన్ మీడియా):
ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా చేర్యాల లోని స్థానిక గాంధీ చౌరస్తాలో తులసి రాం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారం రోజుల ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు.

**–వారం రోజుల పాటు ఉచిత పరీక్షలు**

ఈ మెగా ఉచిత వైద్య శిబిరం జూలై 12 (ఆదివారం) నుండి జూలై 19 వరకు కొనసాగనుందని నిర్వాహకులు వెల్లడించారు. శిబిరానికి వచ్చే ప్రజలకు ఉచితంగా జనరల్ ఓపీ (OP) నిర్వహించడంతో పాటు, రక్తంలో చక్కెర శాతం నిర్ధారణ పరీక్షలు (FBS & PLBS) మరియు గుండె జబ్బుల ప్రాథమిక నిర్ధారణకు చేసే ఈసీజీ (ECG) పరీక్షలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. వీటితో పాటు దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే రోగులకు అనుభవజ్ఞులైన నిపుణుల ద్వారా ప్రత్యేక వైద్య సలహాలు, ఉచిత చికిత్సలు అందించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.

**–అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణ**

ఆసుపత్రి ప్రతినిధులు, వైద్యులు మాట్లాడుతూ.. అన్ని రకాల సాధారణ మరియు దీర్ఘకాలిక వ్యాధులకు తమ హాస్పిటల్‌కు చెందిన అనుభవజ్ఞులైన కన్సల్టెంట్ వైద్యుల ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. చేర్యాల పట్టణ పరిధిలోని ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్ద



సంఖ్యలో హాజరై ఈ ఉచిత అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ వైస్ ఛైర్మన్ కౌన్సిలర్లు, ఆసుపత్రి వైద్య బృందం, పారామెడికల్ సిబ్బంది మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.పూర్తి వివరాలకు 7702440 888 నెంబర్ ను సంప్రదించగలరు.

# ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చా: గడల శ్రీనివాస్

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:
ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, అందుకే జనసేన పార్టీలో చేరినట్లు మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కొత్తగూడెం చుంచుపల్లి మండల పరిధిలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొత్తగూడెం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గడల శ్రీనివాస్ మాట్లాడుతూ, కొత్తగూడెంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా ప్రజలకు సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఆయన సిద్ధాంతాలకు ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. జనసేన జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. సామాజిక తెలంగాణ జనసేనతోనే సాధ్యమని, బీసీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించిన ఏకైక పార్టీ జనసేన అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనసేన జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్, ప్రచార



కార్యదర్శి ఆర్.కే. సాగర్, మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ సమక్షంలో సుమారు 200 మంది యువకులు, మహిళలు జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాము యాదవ్, టీ. శ్రీనివాసరావు, సినీనటుడు తనీష్, హాసీనా, జయశ్రీ, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మిర్యాల రామకృష్ణ, నరేష్, సాదిక్, జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యపత్య క్రీడల్లో హోరాహోరీ పోటీలు

మద్దూరు, హిందుస్థాన్ మీడియా:
మద్దూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అత్యపత్య క్రీడా పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను కనబరుస్తూ హోరాహోరీగా పోటీపడుతున్నారు. ప్రతి మ్యాచ్‌లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదలతో ఆటగాళ్లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా అత్యపత్య అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముకేష్ ఈగల, జిల్లా చైర్మన్ జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి వారికి తగిన ప్రోత్సాహం అందించడమే అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ



లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు భవిష్యత్తులో మరిన్ని శిక్షణా శిబిరాలు, టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో బాలుర విభాగంలో రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, హైదరాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, మంచిర్యాల జిల్లాల జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా, బాలికల విభాగంలో మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వరంగల్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బుస్సా మహేష్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, రాజు, కనకరెడ్డి, రజిత, రజిని, సంతోషిని, రవీందర్ రెడ్డి, పోతరాజు శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మూగబోయిన మధుర గానం: దివికేగిన 'స్వర సామ్రాజ్ఞి' ఎస్. జానకి!

**–ఆరు దశాబ్దాల సినీ ప్రస్థానం...50 వేలకు పైగా అమర గీతాలు**

**–భారతీయ సంగీత ప్రపంచంలో ముగిసిన ఒక అద్భుత శకం..**

ప్రత్యేక ప్రతినిధి (హిందూస్థాన్ మీడియా):
భారతీయ చలనచిత్ర సంగీత ప్రపంచాన్ని ఆరు దశాబ్దాల పాటు తన మధుర గాత్రంతో శాసించిన అద్భుత నేపథ్య గాయని, దక్షిణాది స్వరకోకిల ఎస్. జానకి (88) శనివారం రాత్రి కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో పాటు తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆమె, కర్ణాటకలోని మైసూరులో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి 7:30 గంటల సమయంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని జానకి మనవరాలు అప్సర విద్యుల అధికారికంగా ప్రకటించారు. 60 సంవత్సరాలకు పైబడిన సినీ జీవితంలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడతో పాటు దాదాపు 20 భారతీయ భాషల్లో 50,000 పైగా పాటలు పాడి శ్రోతలను మైమరపించిన జానకి మరణం యావత్ భారత చలనచిత్ర పరిశ్రమను తీవ్ర శోకసంద్రంలో ముంచేసింది. గుంటూరు జిల్లా రేపల్లెలో జననం. సిరిసిల్లతో అనుబంధం శిష్ట శ్రీరామమూర్తి జానకి 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు జన్మించారు. తండ్రి శ్రీరామమూర్తి ఉపాధ్యాయుడిగా, ఆయుర్వేద వైద్యుడిగా పనిచేశారు. ఉద్యోగ రీత్యా ఆయన కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఉండేవారు. చిన్నతనం నుంచే సంగీతం పట్ల ఎంతో మక్కువ చూపిన జానకి, తన మూడవ ఏట నుంచే అనేక కార్యక్రమాల్లో పాల్గొనడం మొదలుపెట్టారు. ఉద్దండులైన సంగీత విద్వాంసుల వద్ద శిష్యరికం చేసి బాల్యంలోనే సినీ సంగీతం వైపు ఆకర్షితులయ్యారు. నాదస్వరం విద్వాన్ పైడిస్వామి వద్ద రాజమండ్రిలో కీర్తనలు నేర్చుకున్న జానకి, తన 19వ ఏట మామయ్య సలహా మేరకు చెన్నైలోని ఏవీఎం (AVM) స్టూడియోలో పాడటం ఆరంభించారు.

**–ఐదు తరాల హీరోయిన్లకు ఆలంబన..**

గొంతులో వైవిధ్యం ?1957లో తమిళ చిత్రం 'విధియిన్ విలయాట్టు'తో జానకి సినీ ప్రస్థానం మొదలైంది. తెలుగులో 'ఎమ్మెల్యే' చిత్రం ద్వారా ఇక్కడి ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలనాటి జమున నుంచి నిన్నమొన్నటి హీరోయిన్ల వరకూ ఐదు తరాల హీరోయిన్లకి ఆమె స్వరం అతికినట్టు సరిపోయేది. జానకి కేవలం గాయనిగానే కాకుండా పాటల రచయితగా, కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసురాలిగా, సంగీత దర్శకురాలిగా కూడా రాణించారు. ఉషాకిరణ్ మూవీస్ వారి 'మౌనపోరాటం' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించి మూడో మహిళా సంగీత దర్శకురాలిగా పేరు గడించారు. 'పదహారేళ్ళ వయసు' చిత్రంలోని 'కట్టుకథలు చెప్పి' పాటలో పండు ముసలావిడ గొంతుతో, 'గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన' పాటలో చిన్న పిల్లాడి గొంతుతో పాడటం ఈమె స్వర వైవిధ్యానికి నిదర్శనం. ఇళయరాజా సంగీత దర్శకత్వంలోనూ, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఈమె పాడిన వేలాది పాటలు తెలుగు సినీ చరిత్రలో సగర్వంగా నిలిచిపోయాయి.

**–పురస్కారాలు మరియు వ్యక్తిగత జీవితం**

జానకి తన తిరుగులేని స్వర సంపదకు గాను 4 సార్లు జాతీయ పురస్కారాలను అందుకున్నారు. 1977లో తమిళ చిత్రం '16 వాయథినిలే' (సెంధూర పూవే పాట), 1981లో మలయాళ చిత్రం 'ఒప్పోల్', 1984లో తెలుగు చిత్రం 'స్వ?ర' (వెన్నెల్లో గోదారి అందం పాట), 1992లో తమిళ చిత్రం 'దేవర్ మగన్' లోని పాటలకు గాను ఉత్తమ నేపథ్య గాయనిగా జాతీయ అవార్డులు సాధించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 10 సార్లు ప్రతిష్టాత్మక నంది పురస్కారాలు అందుకున్నారు. వీటితో పాటు కేరళ రాష్ట్ర అవార్డులు 11 సార్లు, తమిళనాడు అవార్డులు 6 సార్లు



దక్కించు కున్నారు. అయితే, దక్షిణ భారత కళాకారులకు కేంద్ర ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని నిరసిస్తూ 2013లో భారత ప్రభుత్వం ప్రకటించిన 'పద్మభూషణ్' పురస్కారాన్ని ఈమె తిరస్కరించి తన ఆత్మగౌరవాన్ని చాటుకున్నారు. ?జానకి వి. రాంప్రసాద్‌ను వివాహమాడగా, ఆయన 1997లో మరణించారు. ఈమెకు మురళీకృష్ణ అనే ఏకైక కుమారుడు ఉండేవారు. ఆయన కూడా ఈ ఏడాది జనవరి 22న గుండెపోటుతో కన్నుమూశారు. ఏకైక కుమారుడి మరణం జానకిని మానసికంగా ఎంతో కుంగదీసింది. 2016 లోనే గాన విరమణ చేసిన జానకి, వయోభారంతో బాధపడుతూ శనివారం రాత్రి దివికేగారు. జానకి భౌతికకాయానికి మైసూరులోని మహారాజా కాలేజ్ గ్రౌండ్స్‌లో అభిమానుల సందర్శనార్థం ఏర్పాట్లు చేశారు. ఆమె మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రులు, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ అశ్రునివాళి అర్పించారు. జానకి శరీరం మన మధ్య లేకపోయినా, ఆమె ఆలపించిన వేలాది మధుర గీతాల రూపంలో ఆమె ఎప్పటికీ చిరంజీవిగా నిలిచే ఉంటారు. గానకోకిలకు హిందూస్థాన్ మీడియా అశ్రునివాళి

# అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: మంత్రి వివేక్

**-ఆచార్య డాక్టర్ మద్దెల నేతృత్వం లో కార్యక్రమం**

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:

భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ పిలుపునిచ్చారు. ఆదివారం భద్రాచలం పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో కొత్తగూడెంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఆహ్వానం మేరకు మంత్రి తన కాన్వాయిని ఆపి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. భారత రాజ్యాంగ రూపకర్తగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. అంబేద్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ బాట జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్, మాల మహానాడు నాయకులు పల్లా జాన్ రాజశేఖర్, సర్వయ్య, సబ్బారపు మధుసూదన్, గుండా రమేష్, అల్లి శంకర్, సినీ నటుడు తాండూరు ధనరాజ్, కొప్పురి నవతన్, సల్మాన్ తోత, మహమ్మద్ రఫీ, డాక్టర్ తమల జోసెఫ్,



మద్దెల ఆదర్శ్, కేదాసి కిరణ్, చింటూ అఫ్రయిం, సుమన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, థర్డ్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# రాష్ట్రంలో పరిపాలన 'చెత్త సినిమా'లా ఉంది: మాజీ మంత్రి పువ్వాడ అజయ్

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పాలన ఒక లి"చెత్త సినిమా"లిలా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అశ్వాపురంలోని బీఆర్ఎస్ మండల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో కలిసి ఆయన ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టమైన ప్రణాళిక లేదని ఆరోపించిన పువ్వాడ, రైతుల సమస్యలపై సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతలను బెదిరించే వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.

**-కాళేశ్వరం విషయంలో ప్రభుత్వ వైఖరిపై విమర్శలు**

రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక ప్రకారం మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ద్వారా సాగునీటిని వినియోగించి రైతులకు మేలు చేసే అవకాశాన్ని ప్రభుత్వం వదులుకుంటోందన్నారు. హామీలు అమలు చేయడంలో వైఫల్యంఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు నెరవేరలేదని ఆరోపించారు. యూరియా సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అభివృద్ధి పనులు నిలిచిపోయాయి బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన సీతారామ,




సీతమ్మసాగర్ వంటి ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదని, స్థానిక అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని, రానున్న రోజుల్లో సింగరేణి సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ప్రకటించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా మద్దూరు రామాలయం 35వ వార్షికోత్సవం!

మద్దూరు (హిందూస్థాన్ మీడియా):

సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ 35వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ దామెర మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షికోత్సవ వేడుకలకు మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా స్వామివారి నామస్మరణతో భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.

**-శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు -- అభిషేకాలు**

ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ పూజారులు పనుగంటి తిరుపతయ్య, తిగుల్లా రామ్మూర్తి శర్మ సంయుక్తంగా వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. మొదట గణపతి పూజ, కలశ స్థాపన, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, అఘోరార్పణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శివగిరి రామలింగేశ్వర స్వామికి పాలాభిషేకం, త్రిశూల అభిషేకాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, నవగ్రహాభిషేకాలను భక్తుల సమక్షంలో వైభవంగా పూర్తి చేసి మంత్రపుష్పం సమర్పించారు.

**-ఘనంగా సీతారాముల కల్యాణం..**

వార్షికోత్సవంలో భాగంగా గ్రామ ఆడపడుచులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహంకాళి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. ఈ పవిత్ర కల్యాణ క్రతువులో తోలుపునూరి జగదీశ్వర్, నల్లా గౌరీశంకర్, కంఠరెడ్డి శ్రీనివాస్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి



పీఠాలపై కూర్చొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**-భక్తుల కోలాహలం**

గ్రామ పండుగను తలపించిన ఈ 35వ వార్షికోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రెడ్డి మధుసూదన్ రెడ్డి, బస్సా బాలయ్య, వైకుంఠం, రామనాథం, వరాల బాలేషా, బూరుగు శంకర్, మనోహర్, బూర్గు రాజు, రాంబాబుతో పాటు గ్రామ ఆడపడుచులు, యువకులు, దేవాలయ కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పాఠశాల వేదిక నిర్మాణానికి రూ.50 వేల విరాళం!

**-1990-91 SSC బ్యాచ్ పూర్వ విద్యార్థుల చొరవ**

మద్దూరు (హిందూస్థాన్ మీడియా):

తాము చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి పునాది వేసిన సొంత పాఠశాల అభివృద్ధికి మద్దూరు మండల కేంద్రానికి చెందిన పూర్వ విద్యార్థులు ఉదారత చాటుకున్నారు. మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS)లో 1990-91 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ (SSC) పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల బ్యాచ్ ఆదివారం ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సాంస్కృతిక, అధికారిక కార్యక్రమాల వేదిక (స్టేజ్) నిర్మాణం కోసం తమ వంతు సహాయంగా రూ.50,000 నగదు విరాళాన్ని అందజేశారు. ఈ నగదును పాఠశాల ఉపాధ్యాయుడు గుడిసె ఆంజనేయులుకు పూర్వ విద్యార్థుల బృందం అధికారికంగా అందజేసింది.

**-బడి రుణం తీర్చుకోవడం ఆనందంగా ఉంది**

ఈ సందర్భంగా 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. తాము ఈ రోజు సమాజంలో గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నామంటే దానికి కారణం తాము చదువుకున్న మద్దూరు ప్రభుత్వ పాఠశాల మరియు ఇక్కడి గురువులు నేర్పిన క్రమశిక్షణేనని గుర్తుచేసుకున్నారు. అలాంటి పాఠశాల అభివృద్ధి పనులలో తాము కూడా భాగస్వామ్యం కావడం, తమ వంతు ఆర్థిక సహకారం అందించడం ఎంతో సంతోషాన్ని, తృప్తిని ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కూడా పాఠశాలలో ఎలాంటి అవసరాలు ఉన్నా, విద్యార్థుల సౌకర్యార్థం తమ బ్యాచ్ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**-కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు**

సొంత ఊరి బడిపై మమకారాన్ని చాటుకుంటూ తోటివారికి ఆదర్శంగా నిలిచిన ఈ కార్యక్రమంలో తోడుపునూరి జగదీశ్వర్, ఉప్పాల మురళి, బూర్గు




ఐలయ్య, ఉప్పాల శివరామకృష్ణ, దాడూరి యాదగిరి, గందే నర్సయ్య, నర్సింహులు తదితర 1990-91 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల వేదిక నిర్మాణానికి విరాళం అందించినందుకు గాను పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు గ్రామ పెద్దలు పూర్వ విద్యార్థులను అభినందించారు.

# ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుపై గ్రామస్తులను విచారించిన ఏసీపీ





**-వల్లంపట్లలో దర్యాప్తు కొనసాగింపు**

మద్దూరు, హిందుస్థాన్ మీడియా:

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామంలో నమోదైన ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు దర్యాప్తులో భాగంగా హుస్నాబాద్ ఏసీపీ సదానందం ఆదివారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామ పంచాయతీ వెంచర్ అనుమతికి సంబంధించిన వివరాలు అడిగిన సమయంలో గ్రామానికి చెందిన యాదయ్య, హైదరాబాద్‌కు చెందిన బాబు గౌడ్లతో సర్పంచ్ భర్త కర్నె మనోహర్కు వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో యాదయ్య తల్లి మరియమ్మను కులం పేరుతో దూషించారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఏసీపీ సదానందం గ్రామస్తులను విచారించి ఘటనకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం తదుపరి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

## చేర్యాల 7వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

చేర్యాల పట్టణ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న 7వ వార్డు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్ ఆధ్వ ర్యంలో ప్రారంభించారు.ఐఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ ముస్త్యాల అరుణ హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నాణ్యమైన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మేడిశెట్టి ఉమా, కౌన్సిలర్లు కొమ్ము రాజేశ్వరి నర్సింగరావు, మహమ్మద్ ఆరిఫా ఖాజా, ఒగ్గు వెంకటమ్మ మల్లేశం, గీతాంజలి రమేష్, నిమ్మ సుప్రజా రాజీవ్, సురేష్,సదానందం, మహమ్మద్ ఇజాజ్, చేర్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, నాయకులు కాటం సంజీవయ్య, ఆడెపు చంద్రయ్య, పూర్మ ఆగం రెడ్డి, పాల లక్ష్మీనారాయణ, పచ్చిమట్ల వెంకటయ్య, మంచాల చిరంజీవి, ఉడుముల బాలరెడ్డి, ఆడెపు నరేందర్, అంబాల బుచ్చిరాములు, నీలం సన్నీ, పోలోజు ఆంజనేయులు, దినేష్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడిగా అరవింద్



చేర్యాల, హిందుస్థాన్ మీడియా:

చేర్యాల పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో నిర్వహించిన పద్మశాలి యువజన సంఘం అధ్యక్ష ఎన్నికల్లో వీరబత్తిని అరవింద్ ఘన విజయం సాధించారు. మొత్తం 410 ఓట్లలో 213 ఓట్లు పోలవగా, అరవింద్‌కు 147, ప్రత్యర్థి ఇప్పకాయల శ్రీకాంత్‌కు 62 ఓట్లు లభించాయి. నోటాకు 3 ఓట్లు, ఒక ఓటు చెల్లనిదిగా తేలింది. విజయం సాధించిన అరవింద్‌ను సంఘ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో వీరబత్తిని సత్యనారాయణ, గొనె హరి, కొక్కుల సురేందర్, పాము బాలనర్సయ్య, మలిపెద్ది వెంకటేశం, ఎన్నికల నిర్వహణ అధికారులు తవుట రామాంజనేయులు, సుదర్శనం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

**-66 మంది రోగులకు నిపుణుల వైద్య సేవలు**



భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:

సింగరేణి సంస్థ ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఆదివారం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో మెడికోవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్ వైద్యులచే సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు.సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పోట్రు ఆదేశాలు, సీఎంఓ డాక్టర్ ఆర్. కిరణ్ రాజ్ కుమార్ సూచనల మేరకు నిర్వహించిన ఈ శిబిరంలో 66 మంది రోగులకు కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ తదితర విభాగాల నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా సీఎంఓ డాక్టర్ ఆర్. కిరణ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను సింగరేణి ఆసుపత్రుల్లోనే అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నెల రెండో ఆదివారం నిర్వహించే ఈ శిబిరాలను ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడిషనల్ సీఎంఓ డాక్టర్ ఉష పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి. లలిత, మెయిన్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలి

**-జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:



కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా వాణిలో ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతులను లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులను వెంటనే స్వీకరించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రష్మిక ఆసక్తికర పోస్ట్ 'రణబాలి'పై అంచనాలు పెంచేసింది!



టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న కొత్త చిత్రం 'రణబబాలి'. తాజాగా ఈ చిత్రం గురించి రష్మిక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూసిన ఆమె, తన ఉత్సాహాన్ని ఆపుకోలేక సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ఇందులో రణబాలిగా విజయ్, జయమ్మ పాత్రలో రష్మిక అలరించనున్నారు. ఎక్స్ వేదికగా రష్మిక స్పందిస్తూ.. "ఈ విషయం నేను మీతో పంచుకోవచ్చో లేదో తెలియదు. గతంలో చాలాసార్లు జరిగినట్లు దీన్ని డిలీట్ చేయమని అడగరని ఆశిస్తున్నా. కానీ, ఈ కుర్రాళ్లు చాలా బీభత్సం చేస్తున్నారు. ఆ సీన్లు అద్భుతం. నేను కంట్రోల్ చేసుకోలేకపోయా. దీన్ని పెద్ద తెరపై చూడటానికి అస్సలు ఆగలేకపోతున్నా" అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో విజయ్ దేవరకొండతో పాటు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌ను కూడా ఆమె ట్యాగ్ చేశారు. పీరియాడిక్ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న రణబాలి చిత్రానికి రాహుల్ సాంకృత్యన్ దర్శకుడు. రియల్ లైఫ్ జోడీ విజయ్, రష్మిక ఈ సినిమాలోనూ జంటగా నటిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన గీతగోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించాయి.

## టాలీవుడ్‌లో సమంత కొత్త చరిత్ర.. 100 కోట్ల క్లబ్‌లో 'మా ఇంటి బంగారం'

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు నటించిన 'మా ఇంటి బంగారం' తెలుగు చిత్ర పరిశ్రమలో సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన 24 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను అధిగమించి, టాలీవుడ్‌లో ఈ మైలురాయిని చేరుకున్న తొలి లేడీ ఓరియెంటెడ్ చిత్రంగా అరుదైన రికార్డును నెలకొల్పింది. ఈ చారిత్రాత్మక విజయంతో సమంత తన స్టార్‌డమ్‌ను, మార్కెట్ స్టామినాను మరోసారి బలంగా నిరూపించుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ చరిత్రలో ఒక కథానాయిక ప్రధాన పాత్ర పోషించిన సినిమా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరడం ఇదే తొలిసారి. ఇప్పటివరకు ఈ ఘనత కేవలం అగ్ర హీరోల చిత్రాలకే పరిమితం కాగా, సమంత ఆ ముద్రను చెరిపివేశారు. తన అద్భుతమైన నటనతో, బాక్సాఫీస్ వద్ద తనకున్న బలమైన పట్టుతో ఒక సినిమాను ఏ స్థాయికి తీసుకెళ్లగలరో ఆమె నిరూపించారు. ఈ విజయం సమంత కెరీర్‌లోనే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలోనే ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోనుంది. ఈ చిత్రానికి ప్రతిభావంతురాలైన నందిని రెడ్డి దర్శకత్వం వహించారు. గతంలో సమంత, నందిని రెడ్డి కాంబినేషన్‌లో వచ్చిన "ఓ బేబీ" చిత్రం ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు "మా ఇంటి బంగారం"తో ఈ విజయవంతమైన జోడీ మరోసారి తమ మ్యాజిక్‌ను పునరావృతం చేసింది. సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించడం మరో విశేషం. నిర్మాతగా ఆమె తొలి ప్రయత్నమే ఇంతటి భారీ విజయాన్ని అందుకోవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖ దర్శక ద్వయం రాజ్ నిడిమోరు ఈ చిత్రానికి క్రియేటర్‌గా వ్యవహరించగా, సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించింది. విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోయిన "మా ఇంటి బంగారం", ప్రేక్షకుల మద్దతుతో నిలకడగా వసూళ్లు రాబట్టింది. ఈ విజయం భవిష్యత్తులో రాబోయే మహిళా-ప్రధాన చిత్రాలకు ఒక స్ఫూర్తిగా నిలవడమే కాకుండా, వాటిపై అంచనాలను భారీగా పెంచేసింది. ఇకపై ఇలాంటి కథాంశాలతో వచ్చే చిత్రాలు విజయం సాధించాలంటే, "మా ఇంటి బంగారం" సృష్టించిన బెంచ్‌మార్క్‌ను అందుకోవాల్సిన సవాలు ముందుంది. ఈ చారిత్రాత్మక విజయంతో సమంత టాలీవుడ్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు.



# రెండు రోజుల్లో రికార్డు వసూళ్లు దూసుకుపోతున్న అఖిల్ 'లెనిన్'

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రక టించింది. థియేటర్లలో అఖిల్ ఊరమాస్ నటనకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తో ంది.మంచి మౌత్ టాక్ రావడంతో సినిమా వసూళ్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. "ప్రేక్షకుల మౌత్ టాక్ అద్భుతంగా పనిచేస్తోంది. రెండు రోజు ల్లోనే ప్రపంచవ్యాప్తంగా 37.2 కోట్ల గ్రాస్ సాధించి 'లెనిన్' దూసుకుపోతోంది" అంటూ నిర్మాణ సంస్థ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. చాలా కాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురు చూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా రూపంలో అది లభించడంతో అక్కినేని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో అఖిల్ సరసన భా గ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. సితార ఎంట ర్‌టైన్‌మెం ట్స్‌తో పాటు అన్నపూర్ణ స్టూడియోస్, మనం ఎంటర్‌ప్రైజెస్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిం చాయి. ఎస్ఎస్ తమన్ అందించిన నేపథ్య సంగీతం సిని మాకు ప్రధాన బలంగా నిలిచిందని ప్రేక్షకులు చెబు తున్నారు. వీకెండ్ ముగిసే నాటికి ఈ వసూళ్లు మరి ంత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు అం చనా వేస్తున్నారు.




## ఎస్. జానకి మృతితో మళ్లీ తెరపైకి- పద్మభూషణ్‌ను గానకోకిల ఎందుకు వద్దన్నారంటే ?

భారత సినీ సంగీత ప్రపంచంలో తన గానంతో ఆరు దశాబ్దాల పాటు చెరగని ముద్ర వేసిన గానకోకిల ఎస్. జానకి (88) ఇకలేరన్న వార్త సంగీతాభిమానుల ను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఆమె మధుర గీతాలను స్మరించుకుంటూ కోట్లాది మంది నివాళులు అర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఆత్మగౌరవానికి, కళ పట్ల ఆమెకున్న నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన ఒక ముఖ్యమైన సంఘటనను అభిమానులు, విశ్లేషకులు గుర్తు చేసుకుంటున్నారు. అదే 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మభూషణ్'ను ఆమె సున్నితంగా తిరస్కరించడం. ఈ ఘటన వెనుక ఉన్న కారణాలు ఆమె వ్యక్తిత్వాన్ని మరోసారి ఆవిష్కరిస్తున్నాయి. అభిమానుల ప్రేమే గొప్ప పురస్కారం 2013లో, నాటి యూపీఏ ప్రభుత్వం ఎస్. జానకిని పద్మభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ వార్త వెలువడగానే ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే, ఆ సమయంలో కేరళలో ఒక వివాహ కార్యక్రమానికి హాజరైన జానకి, ఈ పురస్కారాన్ని స్వీకరించబోనని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. "గత 55 ఏళ్లుగా పాడుతున్నాను. నా అభిమానులు నా పాటలను ఎంతగానో ఆదరించారు. వారి ప్రేమ కంటే నాకు పెద్ద పురస్కారం లేదు. ప్రభుత్వం నన్ను గుర్తించినందుకు సంతోషం. కానీ, ఈ అవార్డును నేను స్వీకరించడం లేదు" అని ఆమె మీడియాకు స్పష్టం చేశారు. ప్రభుత్వం తప్పు చేసిందని తాను భావించడం లేదని, వారిపై తనకు ఎలాంటి అసంతృప్తి లేదని కూడా ఆమె వివరించారు.తిరస్కరణ వెనుక అసలు కారణం ఇదే! అభిమానుల ఆదరణే కారణమని తొలుత చెప్పినప్పటికీ, ఈ తిరస్కరణ వెనుక బలమైన కారణం ఉందని తర్వాత స్పష్టమైంది. మరో ఇంటర్వ్యూలో ఆమె తన ఆవేదనను నిర్మొహమాటంగా వెల్లడించారు. ముఖ్యంగా, దక్షిణ భారత కళాకారుల పట్ల కేంద్ర ప్రభుత్వాలు చూపిస్తున్న నిర్లక్ష్యం, గుర్తింపులో జరుగుతున్న తీవ్ర జాప్యంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "నాకు 80 ఏళ్లు వస్తున్నాయి. ఇన్నేళ్ల సుదీర్ఘ ప్రస్థానం తర్వాత ఇప్పుడు ఈ పురస్కారం ప్రకటించారు. ఇది చాలా ఆలస్యంగా వచ్చిన గౌరవం. ఉత్తరాది కళాకారులకు తక్కువ వయసులోనే పెద్ద పురస్కారాలు లభిస్తున్నాయి, కానీ దక్షిణాది వారిని గుర్తించడానికి చాలా సమయం తీసుకుంటున్నారు. ఈ ఆలస్యమైన గౌరవాన్ని స్వీకరించాలని నా మనస్సాక్షి అంగీకరించడం లేదు" అని ఆమె పేర్కొన్నారు. ఆ సమయంలో జానకి భారతరత్నకు అర్హురాలని, అందుకే పద్మభూషణ్‌ను వద్దన్నారని కొన్ని కథనాలు కూడా ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ వ్యాఖ్యలను ఆమె అధికారికంగా ఎప్పుడూ ధ్రువీకరించలేదు. కేవలం పురస్కారం ఆలస్యం కావడమే తన నిరాకరణకు ప్రధాన కారణమని ఆమె స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల మద్దతు జానకి గారి నిర్ణయాన్ని ఆమె కుమారుడు మురళీకృష్ణ కూడా పూర్తిగా సమర్థించారు. ఈ పురస్కారం తన తల్లికి ఎప్పుడో 20, 25 ఏళ్ల క్రితమే రావాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, పురస్కారానికి ఎంపిక చేసిన విషయాన్ని ప్రకటనకు ముందు కనీసం తమ కుటుంబానికి తెలియజేయలేదని, మీడియా ద్వారానే తెలిసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455